సాక్షి
అనంతపురం

బుధవారం ၊ 28 ၊ మే ၊ 2025



చీనీ టన్ను రూ.34,120

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.34,120 పలికాయి.



బాబు స్వార్థం.. సీమకు అన్యాయం

ముఖ్యమంత్రి చంద్రబాబు స్వార్థానికి రాయలసీమకు అన్యాయం జరుగుతోంది. రైతులు దీనిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 8లో



జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

'నవోదయ' నిర్మాణానికి భూమిని గుర్తించండి



కళ్యాణదుర్గం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

కళ్యాణదుర్గం/కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో జవహర్ నవోదయ విద్యాలయం నిర్మాణం కోసం అవసరమైన భూమిని గుర్తించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కళ్యాణదుర్గం పట్టణ పరిధిలోని ధర్మవరం రోడ్డులో సర్వే నంబర్ 464లో 17.12 ఎకరాలు, సర్వే నంబర్ 465లో 1.35 ఎకరాలను, అలాగే, ఈస్ట్ కోడిపల్లి సమీపంలో సర్వే నంబర్ 389లోని 37.45 ఎకరాల భూమిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవోదయ విద్యాలయం కోసం ప్రభుత్వ భూమి ఉంటే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయాన్ని సందర్శించి, ఆర్డీఓ వసంతబాబు, సర్వే అధికారులతో సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద అధికారులు చేపట్టిన 'యోగాంధ్ర' రిజిస్ట్రేషన్ సర్వేను కలెక్టర్ వినోద్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి డ్వామా పీడీ, జెడ్పీ సీఈఓ, డీపీఓ తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే సూర్యనారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వంశీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

28 పడకలతో కోవిడ్ వార్డు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఈఎన్‌టీ వార్డులో 28 పడకలతో కోవిడ్ వార్డును ఏర్పాటు చేశారు. మూడు వెంటిలేటర్లు, 50 వీటీఎం కిట్లను అందుబాటులో ఉంచారు. మంగళవారం ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈఎన్‌టీ వార్డులో 24 గంటలూ స్టాఫ్ నర్సులు ఉండేలా, టెక్నీషియన్, వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని నోడల్ ఆఫీసర్ డాక్టర్ రామస్వామిని ఆదేశించారు.

రాయదుర్గం, గుమ్మఘట్టకు అత్యధిక అలాట్‌మెంట్



అనంతపురం అగ్రికల్చర్: రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ ప్రక్రియలో భాగంగా పంట విస్తీర్ణం బట్టి మండలాలకు విత్తన కేటాయింపులు చేశారు. ఈ ఏడాది జిల్లాకు కేవలం 50,592 క్వింటాళ్ల కేటాయించారు. అందులో కే-6 రకం 46,692 క్వింటాళ్లు, కదిరి-లేపాక్షి (కే-1812) రకం 900 క్వింటాళ్లు, టీసీజీఎస్-1694 రకం 3 వేల క్వింటాళ్ల పంపిణీకి అనుమతులు జారీ చేశారు. తాజాగా డివిజన్లు, మండలాల వారీగా విత్తన వేరుశనగ బస్తాలను అలాట్ చేశారు. రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాలకు అత్యధికంగా 3 వేల క్వింటాళ్ల చొప్పున కేటాయించగా... యల్లనూరు మండలానికి క్వింటా కూడా కేటాయించకపోవడం గమనార్హం. ఇక పుట్లూరుకు 50 క్వింటాళ్లు, తాడిపత్రి మండలానికి 100 క్వింటాళ్లు ఇచ్చారు. మొత్తమ్మీద కళ్యాణదుర్గం సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న ఆరు మండలాలకు అత్యధికంగా 14,462 క్వింటాళ్లు కేటాయించారు. ఆ తర్వాత అనంతపురం సబ్ డివిజన్ పరిధిలో ఆరు మండలాలకు 10,500, రాయదుర్గం డివిజన్‌లో ఐదు మండలాలకు 10,200, ఉరవకొండ డివిజన్‌లో నాలుగు మండలాలకు 6,850, గుత్తి సబ్ డివిజన్‌లో ఐదు మండలాలకు 6,750 క్వింటాళ్లు అలాట్ చేశారు. అత్యల్పంగా తాడిపత్రి సబ్ డివిజన్ పరిధిలో ఐదు మండలాలకు 1,830 క్వింటాళ్లు కేటాయించారు.

రాయితీ ఇలా..

కే-6, టీసీజీఎస్-1694 రకం క్వింటా పూర్తిధర రూ.9,300 కాగా 40 శాతం రాయితీ రూ.3720 పోనూ రైతుల వాటా కింద రూ.5,580 ఖరారు చేశారు. కే-1812 రకం ధర రూ.8,200 కాగా రాయితీ రూ.3,280 పోనూ రైతులు రూ.4,920 ప్రకారం చెల్లించాలి. ఒక్కో రైతుకు గరిష్టంగా 30 కిలోల బస్తాలు మూడు పంపిణీ చేయనున్నారు.

అలసిపోయాం బాబూ..
హామీల అమలెప్పుడు?

హామీలిచ్చి మోసం చేయడం ఆయనకు కొత్తకాదు. ఎన్నికలకు ముందు అలివిగాని హామీలతో ఊదరగొట్టడం.. అధికారంలోకి వస్తే వాటిని గాలికొదిలేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. 'పూర్తిగా రుణమాఫీ చేస్తాను, మీ బంగారంపై తీసుకున్న రుణం పైసా కట్టొద్దు, లోన్లు చెల్లించొద్దు' అంటూ 2014 ఎన్నికల ముందు చెప్పిన ఆయన.. అప్పట్లో సీఎంగా బాధ్యతలు చేపట్టాక తూతూ మంత్రపు సాయంతో కుచ్చుటోపీ పెట్టారు. ఆ తర్వాత రైతులకు నోటీసులు ఇప్పించి భూముల్ని వేలం వేయించారు. ఇక.. 2024 మేలో జరిగిన ఎన్నికల్లోనూ ఇదే జరిగింది. సూపర్ సిక్స్ హామీలంటూ సామాన్యుల్లో లేని ఆశలు కల్పించి... అధికారంలోకి వచ్చాక లక్షలాది మందిని నట్టేట ముంచారు.






- ఎన్నికల వేళ సూపర్‌సిక్స్ పథకాలపై చంద్రబాబు డప్పు
- అధికార పగ్గాలు చేపట్టాక హామీలన్నీ గాలికి
- ఏడాది పూర్తవుతున్నా ఒక్క రూపాయీ అందించని వైనం
- మండిపడుతున్న లబ్ధిదారులు

సాక్షిప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు పగ్గాలు చేపట్టి ఏడాది కావొస్తున్నా హామీలు అమలు కావడం లేదు. మేనిఫెస్టోను చిత్తుకాగితంలా భావించిన సీఎం చంద్రబాబు సామాన్యుల నోట మట్టికొట్టారు. ఈ క్రమంలో జిల్లాలో నేడు ఏ పల్లెకు వెళ్లినా, ఏ గల్లీకి వెళ్లినా కూటమి సర్కారు మోసాల గురించి చర్చలు సాగుతున్నాయి.గత ప్రభుత్వ హయాంలో క్యాలెండర్ ప్రకారం ఏ నెలలో ఏ పథకానికి ఎంత సొమ్ము ఇవ్వాలో బటన్ నొక్కి మరీ వారి ఖాతాలోకి జమ చేశారు. తాజా పరిస్థితుల్లో 'పాలిచ్చే ఆవును కాదని తన్నే దున్నపోతు'ను తెచ్చుకున్నామన్న చందంగా పరిస్థితి తయారైందని గ్రామాల్లో చర్చ జరుగుతోంది.

నిరుద్యోగ భృతి.. భ్రాంతి




చంద్రబాబు మాటలు నమ్మి నిలువునా మోసపోయామంటున్నారు జిల్లాలోని నిరుద్యోగులు. భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తానన్న ఆయన పైసా ఇవ్వలేదు. జిల్లాలో ఇంటర్ నుంచి ఇంజినీరింగ్ తదితర చదువులు పూర్తి చేసిన వారు 5.30 లక్షల మంది వరకూ ఉన్నారు. వీళ్లందరూ భృతి కోసం ఎదురు చూస్తున్నారు. కానీ బాబు మాత్రం ఆ ఊసే ఎత్తక పోవడంతో దగా పడ్డామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో నిరుద్యోగులు ఇలా..

జిల్లా జనాభా	22.40 లక్షలు
పీజీ, ఎంటెక్ చేసిన యువత	78,000
డిగ్రీ, బీటెక్ చేసిన వారు	1,62,000
టీటీసీ చదివిన వారు	28,800
ఐటీఐ, డిప్లొమా..	51,000
ఇతరత్రా విద్యార్హతలు..	2,10,000
మొత్తం నిరుద్యోగులు	5,29,800

తల్లుల వేదన అంతా ఇంతా కాదు




గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్కూళ్లు తెరిచిన వారం రోజుల్లోనే 'అమ్మఒడి' పేరుతో రూ.15 వేలను నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. కానీ 2024 ఎన్నికల్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తానన్న బాబు.. సీఎంగా బాధ్యతలు చేపట్టి ఏడాది కావొస్తున్నా 'తల్లికి వందనం' మాటే ఎత్తడం లేదు. పైగా ఒక్కో రోజు ఒక్కోమాట మాట్లాడుతున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివేవారికే అని ఒకసారి.. ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులందరికీ అని మరోసారి.. ఇటీవల మార్గదర్శకాల్లో ఒకరికే అని ఇచ్చి తర్వాత ఉపసంహరించుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో 4 లక్షల మంది చిన్నారుల తల్లులు ప్రభుత్వ సాయం కోసం కళ్లకు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు.

తల్లికి వందనం అర్హులు..

జిల్లాలో 1 నుంచి ఇంటర్ వరకూ చదువుతున్న విద్యార్థుల సంఖ్య	4,07,900
ప్రభుత్వ పాఠశాలల్లో..	2,10,008
ప్రైవేట్ పాఠశాలల్లో..	1,97,892

రైతులకు శఠగోపం..




గతంలో రుణమాఫీ అంటూ రైతులకు శఠగోపం పెట్టిన బాబు.. గత ఎన్నికల ముందు ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు ఇస్తానని నమ్మబలికారు. దీంతో సుమారు 2.90 లక్షలమంది రైతులు నిజమే అనుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చూస్తే రైతు సాయం ఊసే లేదు. దాని గురించి చర్చ కూడా లేదు. గత ప్రభుత్వం ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం కింద మూడు దఫాల్లో ఇచ్చింది. బాబు తన ప్రచారంలో రూ.20 వేలు అనే సరికి ఆశపడి ఓటు వేస్తే ఇప్పుడు నిలువునా ముంచారని, ఖరీఫ్‌లో పైరు సాగు చేద్దామంటే పైసా సాయం ఇవ్వలేదని రైతులు వాపోతున్నారు.

అన్నదాత సుఖీభవ అర్హులు

రైతులు	2,90,899
తొలి ఏడాది అందాల్సిన సాయం	రూ.20,000
ఈ ఏడాది రైతులకు ఇవ్వాల్సిన మొత్తం	రూ.581.79 కోట్లు

మహిళలకు మళ్లీ దగా..



2019 ఎన్నికల్లో 'పసుపు కుంకుమ' అంటూ చివరి సారిగా రూ.10 వేలు ఇచ్చి మభ్య పెట్టిన బాబు..2024 ఎన్నికల్లో ప్రతి మహిళకూ రూ.1,500 ఇస్తానన్నారు. కానీ ప్రభుత్వం వచ్చాక చూస్తే పైసా ఇవ్వలేదు. ఈ క్రమంలో అక్కచెల్లెమ్మలు తాము మళ్లీ నట్టేట మునిగామా అన్న ఆలోచనలో పడ్డారు. ఇక.. ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లలో నామమాత్రంగా అక్కడొకటి అక్కడొకటి ఇచ్చారు. ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణంపై ఇప్పటివరకూ ముహూర్తమూ కుదరలేదు.

జిల్లాలో అక్కచెల్లెమ్మల వివరాలు..

18 ఏళ్లు నిండిన మహిళలు	10,20,124
వీళ్లకు ఒక్కొక్కరికి నెలకు ఇవ్వాల్సింది	రూ.1500
జిల్లాలో మొత్తం మహిళలు	14,57,070
ఆర్టీసీ సర్వీసులు	491
అద్దె బస్సులు	105

నిరుద్యోగులకు మోసం



ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పిన కూటమి పార్టీలు.. అధికారంలోకి వచ్చిన తర్వాత నిలువునా మోసగించాయి. అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ఒక జాబ్ క్యాలెండర్ కానీ, నిరుద్యోగ భృతి కానీ ఇవ్వలేదు. కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాలో ఉపాధి కల్పించే పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు.వలంటీర్లకు రూ.10 వేలు వేతనం అన్నారు...ఉన్నవారందరినీ పీకేశారు. ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే వాహనాలను రద్దు చేసి వాటిపై ఆధారపడ్డ సిబ్బందిని రోడ్డుపాలు చేశారు.

– కసాపురం రమేష్, జిల్లా కార్యదర్శి, డీవైఎఫ్ఐ

సాయం కోసం ఎదురు చూస్తున్నాం



కూటమి ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నాం. గత ఏడాది కూడా పెట్టుబడి సాయం మంజూరు కాలేదు. ప్రస్తుతం రైతుల వెరిఫికేషన్ చేస్తున్నారు. పెట్టుబడి సాయం వస్తే కొంత ఉపశమనంగా ఉంటుంది. మా ఆశలను కూటమి ప్రభుత్వం నెరవేర్చుతుందో లేదో చూడాలి.

– మునయ్య, ముచ్చుకోట, తాడిపత్రి మండలం

పేదలకు శాపంగా మారిన ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాది కావొస్తున్నా ఇప్పటి వరకు పేద ప్రజలకు ఏ మేలూ జరగలేదు. సంక్షేమ పథకాల ఊసే లేదు. పట్టణ, గ్రామ పరిధిలో నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇస్తామని చెప్పిన మాటను చంద్రబాబు ప్రభుత్వం నిలబెట్టుకోలేదు. అలాగే సూపర్ సిక్స్ పథకాలను సైతం అమలు చేయకుండా దగా చేశారు. పేద ప్రజలకు ఈ ప్రభుత్వం శాపంలా మారింది.

–చిరంజీవి యాదవ్, సీపీఐ పట్టణ కార్యదర్శి, తాడిపత్రి

బాబు జీవితమంతా మోసమే



2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీలను ఇచ్చి ప్రజలను వంచించారు. గత ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్‌తో పాటు 145 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఇంత వరకు ఒక్క హామీ నెరవేర్చలేదు. చంద్రబాబు జీవితమంతా పచ్చి మోసం. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిలు మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లా భావించి సంక్షేమం అందించారు. మేనిఫెస్టో అమలు చేయని పార్టీ గుర్తింపును ఎన్నికల సంఘం రద్దు చేయాలి. ఆ దిశగా పార్లమెంట్‌లో చర్చ జరగాలి.

– అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

తప్పులతడక.. గందరగోళం

- హెచ్‌ఎంల సీనియార్టీ పదోన్నతుల జాబితాలో తప్పులు
- పట్టించుకోని అధికారులు.. కోర్టుకెళ్తామంటున్న బాధిత టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: స్కూల్ అసిస్టెంట్ నుంచి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతుల కోసం అధికారులు రూపొందించిన సీనియార్టీ జాబితా గందరగోళంగా మారిందంటూ టీచర్లు వాపోతున్నారు. కామన్ సీనియారిటీ లెక్కించేటప్పుడు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పొందిన వారికి వారి ర్యాంకుల ప్రకారం వివిధ సబ్జెక్ట్‌లను కలుపుతూ జాబితా తయారు చేస్తారు. కానీ ఎస్జీటీ నుంచి పాఠశాల సహాయకులుగా ముఖ్యంగా ఒకే డీఎస్సీలో ఎస్జీటీగా ఎన్నికై ఒకేరోజు పదోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్లతో ఉమ్మడి సీనియార్టీ తయారు చేసేటప్పుడు వారి ఫీడర్ కేటగిరీ (ఎస్జీటీ) లో మెరిట్‌ను ప్రాతిపదికగా తీసుకుంటారు. అయితే, ప్రస్తుత పదోన్నతుల్లో ఈ విధానాన్ని పక్కనపెట్టడంతో సీనియర్లకు తీవ్ర అన్యాయం జరుగుతోందంటున్నారు.

మెరిట్‌కు మంగళం...

1994 డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికై ...2002 నవంబరులో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన వారి సీనియార్టీ జాబితాలో పరిశీలిస్తే.. డీఎస్సీలో 36వ మెరిట్ ర్యాంకుగా ఉన్న టీచరు కంటే కూడా 397 ర్యాంకు టీచరును ముందు పెట్టారు. 99వ ర్యాంకు పొందిన టీచరుకంటే కూడా 161, 378, 141, 373 ర్యాంకు టీచర్లు ముందున్నారు. ఈ ఐదుగురూ (99,161,378,141,373 ర్యాంకర్లు) కూడా 36 ర్యాంకు టీచరుకంటే ముందున్నారు. అందరూ ఓపెన్ కేటగిరీ టీచర్లు కావడం విశేషం.

కోర్టుకు వెళ్లే ఆలోచనలో టీచర్లు

హెచ్‌ఎం పదోన్నతులకు తయారు చేసిన సీనియార్టీ జాబితాలో మెరిట్‌ను తుంగలో తొక్కి, సీనియర్లకు అన్యాయం చేయడంపై బాధిత టీచర్లు హైకోర్టును ఆశ్రయించేందుకు సమాయత్తమవుతున్నారు. 20 ఏళ్లకు పైగా ప్రమోషన్స్ లేక ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులను 'వింత పద్ధతి' దెబ్బ తీస్తోందంటూ వాపోతున్నారు.

కుప్పలు తెప్పలుగా విన్నపాలు



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్‌కు సంబంధించి విన్నపాలు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో జరిగిన పొరబాట్లు, సాంకేతిక సమస్య కారణంగా చాలామందికి అర్హత ఉన్నా కూడా వివిధ పాయింట్లు నమోదు కాలేదు. కొందరు దరఖాస్తు సమయంలో పొరబాట్లు చేశారు. ఈ కారణంగా వారికి నిబంధన మేరకు రావాల్సిన పాయింట్ల కంటే తక్కువ నమోదయ్యాయి. అర్హత ఉండీ రావాల్సిన పాయింట్ల కంటే తక్కువ రావడంతో ఆందోళన చెందుతూ డీఈఓల వద్దకు టీచర్లు పరుగులు తీస్తున్నారు.

పని చేయని ఆన్‌లైన్ గ్రీవెన్స్ సెల్

ప్రతి టీచరూ వ్యక్తిగత ట్రాన్స్‌ఫర్ లాగిన్‌లో వెళ్తే...అక్కడ గ్రీవెన్స్ ఆప్షన్ ఉంచారు. ఆప్షన్ ఓపెన్ చేసి తమ సమస్య విన్నవించుకోవచ్చు. అయితే ఎన్నిమార్లు ప్రయత్నించినా 'ఎనేబుల్' కాలేదని చూపుతోంది. ఈ క్రమంలో ఉపాధ్యాయులు డీఈఓతో పాటు వారి పరిధిలోని ఎంఈఓలను కలిసి విన్నవిస్తున్నారు. ఎంఈఓలు తమ లాగిన్‌లో అప్లికేషన్లు ఓపెన్ అయిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఫార్వర్డ్ చేసేస్తున్నారు. ఎడిట్ ఆప్షన్ ఉన్నా... పరిష్కరించే సమయం లేక వెంటనే ఆమోదం తెలుపుతున్నారు. డీఈఓ లాగిన్‌కు రాగానే ఇక్కడి ఐటీ ఉద్యోగులు కూడా అదే స్పీడ్‌తో ఆమోదం తెలుపుతుండటం గమనార్హం.

రైతాంగాన్ని ఆదుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'ఖరీఫ్, రబీకి సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ ఇవ్వకపోవడంతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉంది. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతున్నా ఇంత వరకు విత్తన కేటాయింపులు జరపలేదు. ప్రజాప్రతినిధులు స్వార్థ రాజకీయాలు వీడి రైతాంగాన్ని ఆదుకోవాలి' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023-24 ఖరీఫ్‌లో 17 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారని, కేంద్ర బృందం పర్యటించి వెళ్లినా ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదన్నారు. 2024 ఖరీఫ్ సీజన్‌లో రైతులు పెద్ద ఎత్తున పంటలు నష్టపోయినా కేవలం 7 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 15 లక్షల ఎకరాలకు పైబడి పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేసినట్లు తెలిపారు. ఇందు కోసం 3.11 లక్షల క్వింటాళ్ల విత్తనం అవసరమని ప్రతిపాదనలు పంపితే ప్రభుత్వం కేవలం 1.14 లక్షల క్వింటాళ్లను కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు.


ఒక్క రూపాయి ఇచ్చారా?

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పెట్టుబడి సాయం కింద రైతుకు రూ.13,500 చొప్పున అందజేశామని 'అనంత' గుర్తు చేశారు. అప్పట్లో సున్నావడ్డీ, పావలా వడ్డీ వచ్చేవన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పి, ఇంత వరకు ఒక్క రూపాయి ఇవ్వకుండా మోసం చేశారన్నారు. సున్నా, పావలా వడ్డీ అందే పరిస్థితి లేదన్నారు. బ్యాంకు రుణాలను రెన్యూవల్ చేయడం లేదన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న ఉచిత పంటల బీమాను కూటమి ప్రభుత్వం తొలగించిందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే సమయంలో ప్రజాప్రతినిధులు, కలెక్టర్ ఒక్క సమీక్ష అయినా చేశారా అని ప్రశ్నించారు. ఇటీవల జెడ్పీ సమావేశంలో రైతు సమస్యలను ప్రస్తావించిన పాపాన పోలేదన్నారు. 'ఆ ఫొటో ఇక్కడుండాలి, ఈ ఫొటో అక్కడుండాలి' అని అనుకోవడానికే సమయం సరిపోయిందన్నారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు, ఇద్దరు ఎంపీలు, 14 మంది ఎమ్మెల్యేలు ఉన్నా.. రైతులకు ఎటువంటి మేలు జరగడం లేదన్నారు. అధిక ధరలకు ఎరువుల అమ్మకాలు చేస్తున్నా విజిలెన్స్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గత ఏడాది డీఏపీ, యూరియా, పొటాష్ కృత్రిమ కొరత సృష్టించారని, బస్తాపై రూ.30 నుంచి రూ.50 వరకు అధికంగా అమ్ముకున్నారని, ఈ ఏడాదీ అదే పరిస్థితి ఉందన్నారు. రైతులు అష్ట కష్టాలు పడుతుంటే ప్రజాప్రతినిధుల దృష్టంతా ఆదాయం, వ్యాపారాలపైనే ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీలను, తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించడం తప్ప మరేమీ చేయడం లేదన్నారు. అసలు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఉన్నారా అనే పరిస్థితి ఉందన్నారు. తక్షణం సీఎంతో మాట్లాడి ఉమ్మడి అనంతపురం జిల్లా రైతాంగాన్ని ఆదుకునే దిశగా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, రైతు విభాగం అనంతపురం నియోజకవర్గం అధ్యక్షుడు నాగేశ్వర్ రెడ్డి, కార్పొరేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మరణించిన వారికీ 'ఉపాధి'

- పుట్లూరు మండలం జంగంరెడ్డిపేట గ్రామానికి చెందిన రమాదేవి మూడేళ్ల క్రితం మృతి చెందింది. కానీ, యర్రకొండలో 2024 నవంబర్ 18 నుంచి 24 వరకూ, అదే నెల 25 నుంచి డిసెంబర్ 1 వరకూ చేపట్టిన ఉపాధి హామీ పనులకు ఆమె హాజరైనట్లు నమోదు చేశారు. రూ.2,198.86 ఖాతాలో జమ చేశారు.
- జంగంరెడ్డిపేటకు చెందిన ప్రభాకర్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. ఇతని పేరుపై 2024 అక్టోబర్ 28 నుంచి 2024 నవంబర్ 3వ తేదీ వరకు యర్రకొండలో కందకాల పనులు చేపట్టినట్లు మస్టర్ కూడా నమోదు చేశారు. అయితే ప్రభాకర్‌రెడ్డి ఖాతా అప్పటికే తొలగించడంతో బిల్లులు పడలేదు.

పుట్లూరు: మండలంలో ఉపాధి హామీ పథకంలో అక్రమాలు తారస్థాయికి చేరాయి. జాబ్‌కార్డు ఉంటే చాలు పనికి వెళ్లకపోయినా హాజరు వేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పలువురు సిబ్బంది ఏడాదిలో జాబ్‌కార్డుకు రూ.30 వేలు జమచేయించి లబ్ధిదారుడికి రూ.15 వేలు ఇచ్చి మిగతాది దోచుకుంటున్నారు. దీంతో పాటు క్షేత్ర స్థాయిలో అప్పటికే పూర్తైన పనులను పదే పదే పరిశీలించి కొలతల ఆధారంగా మళ్లీ చెల్లింపులు చేస్తున్నారు. గ్రామాల్లో లేని వారు, ఉద్యోగాలు చేస్తున్న వారి పేర్లపై మస్టర్లు నమోదు చేసి అక్రమాలకు పాల్పడుతున్నారు. సామాజిక తనిఖీ బృందాలు సైతం తూతూ మంత్రంగా విచారణ చేపట్టి వెళ్లిపోతుండటంతో ఉపాధి సిబ్బంది అక్రమాలకు అంతే లేకుండా పోతోంది. జంగంరెడ్డిపేటలో 'ఆత్మలకు' 'ఉపాధి' కల్పించిన విషయంపై పుట్లూరు ఎంపీడీఓ అలివేలమ్మ వివరణ కోరగా.. ఆమె స్పందించారు. మరణించిన వారి పేరుపై బిల్లులు చేసిన విషయం తమ దృష్టికి రాలేదని, క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



మృతురాలు రమాదేవి పేరుపై బిల్లులు

క్లుప్తంగా

పీఆర్‌లో సజావుగా బదిలీల కౌన్సెలింగ్



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న పీఆర్ ఈఎన్‌సీ బాలూనాయక్, ఎస్‌ఈ జహీర్ అస్లాం

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ (పీఆర్) శాఖకు సంబంధించి అనంతపురంలోని పీఆర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జోనల్ స్థాయి (రాయలసీమ జిల్లాలు) బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా ముగిసింది. అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, బాలాజీ (తిరుపతి), చిత్తూరు, నంద్యాల, కర్నూలు జిల్లాలకు చెందిన డీఈఈలు, ఏఈఈలు, జేఈఈలు, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టెక్నికల్ ఆఫీసర్లు హాజరయ్యారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్ ప్రక్రియ సాయంత్రం 6 గంటల వరకూ కొనసాగింది. ఆ శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) బాలూనాయక్, ఎస్‌ఈ జహీర్ అస్లాం, శ్రీసత్యసాయి జిల్లా ఎస్‌ఈ మురళి, ఇతర జిల్లాల ఎస్‌ఈలతో పాటు పీఆర్‌ఐ ఈఈ ప్రభాకరరెడ్డి, అనంతపురం సబ్ డివిజన్–1, 2 డీఈఈలు లక్ష్మీనారాయణ, కృష్ణజ్యోతి, సర్కిల్ కార్యాలయ సూపరింటెండెంట్లు ఖాజా మొహిద్దీన్ తదితరులు పర్యవేక్షించారు. ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారితో పాటు రిక్వెస్ట్ బదిలీలనూ ఆమోదించారు.

గాలిమరలు కూల్చేశారు!

పుట్లూరు: మండలంలోని ఎ.కొండాపురం వద్ద కొండలపై ఏర్పాటు చేసిన గాలిమరలు నెల రోజుల వ్యవధిలో రెండు కూలిపోయిన విషయం తెలిసిందే. అయితే ఈ గాలిమరలు కూలిపోలేదని పరికరాల చోరీ కోసం కొందరు దుండగులు సపోర్ట్ దిమ్మెలకు ఉన్న ఇనుప చువ్వలను కత్తిరించి కూల్చేసినట్లు భారత్ హెవీ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ ప్రతినిధులు గుర్తించారు. ఈ మేరకు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే కూల్చి వేసిన గాలిమరల్లోని విలువైన పరికరాలను చోరీ చేసినట్లు తెలిపారు. వీటి విలువ రూ.లక్షల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

హామీల అమలు కోసం పోరుబాట

- సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

అనంతపురం అర్బన్: అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా.. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో సీఎం చంద్రబాబు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, హామీల అమలు కోసం సీపీఐ ఆధ్వర్యంలో పోరుబాటకు సిద్ధమైనట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం స్థానిక ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విడుదల చేసి, మాట్లాడారు. మేనిఫేస్టోలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని, సూపర్ సిక్స్ అమలు చేయాలనే డిమాండ్‌తో జూన్ 2వ తేదీన జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల తహసీల్దారు కార్యాలయాల ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నాలు తలపెట్టామన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకెళ్లేలా చేపట్టిన ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, నగర కార్యదర్శి శ్రీరాములు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజేష్ గౌడ్, నగర సహాయ కార్యదర్శి అల్లీపీరా పాల్గొన్నారు.

బాబు స్వార్థం.. సీమకు అన్యాయం

- హంద్రీ–నీవా లైనింగ్ పనులతో బీళ్లుగా మారనున్న రాయలసీమలోని 6 లక్షల ఎకరాలు
- కుప్పంకు నీరు తీసుకెళ్లేందుకు ఈ ప్రాంత రైతులకు అన్యాయం చేస్తున్న చంద్రబాబు
- అన్యాయాన్ని ప్రతిఘటించకపోతే రైతు మనుగడకే ముప్పు
- ప్రభుత్వంపై పోరుకు సిద్ధమంటున్న 'రాప్తాడు' రైతులు



ఆత్మకూరు మండలం సిద్దరాంపురం వద్ద హంద్రీ నీవా కాలువలో పూర్తయిన కాంక్రీట్ లైనింగ్ పనులు

ఆత్మకూరు: జిల్లాలో రైతు మనుగడను కూటమి ప్రభుత్వం ప్రశ్నార్థకం చేస్తోంది. కుప్పం ప్రాంతానికి హంద్రీ–నీవా ద్వారా కృష్ణా జలాలను తీసుకెళ్లాలనే సీఎం చంద్రబాబు స్వార్థపూరిత నిర్ణయం రాయలసీమ ప్రాంతానికి తీరని అన్యాయం చేస్తోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ రాప్తాడు నియోజకవర్గ రైతులు ఉద్యమ కార్యాచరణతో ముందుకు సాగేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ ఈ నెల 29 నుంచి రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రకటించారు.

టీడీపీ నేతల్లోనూ వ్యతిరేకత

కరువు పీడిత రాయలసీమను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా హంద్రీ–నీవా ప్రాజెక్ట్ చేపట్టి దాదాపు 90 శాతం పనులు పూర్తి చేశారు. కాలువలో నీరు ప్రవహించే సమయంలో ఎంతో కొంత నీరు భూమిలోకి ఇంకడం ద్వారా చుట్టుపక్కల బోరుబావుల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. దీంతో జిల్లాలో ఉద్యాన పంటలు గణనీయంగా విస్తరించాయి. తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హంద్రీ–నీవా కాలువ సామర్థ్యాన్ని 83 టీఎంసీలకు పెంచుతూ పనులకు పరిపాలన అనుమతులు జారీ చేశారు. అదే సమయంలో ఎన్నికల కోడ్ అమలులోకి రాకపోవడంతో ఈ పనులు ముందుకు సాగలేదు. అనంతరం ఈ పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. తన సొంత నియోజకవర్గం కుప్పం ప్రాంతానికి కృష్ణా జలాలను తీసుకెళ్లేందుకు కాలువకు లైనింగ్ పనులను సీఎం చంద్రబాబు చేపట్టారు. ఈ పనులు పూర్తయితే భూగర్భ జలాలు తగ్గిపోయి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్షల ఎకరాలు బీళ్లుగా మారుతాయి. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు సైతం ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో లైనింగ్ పనులను అడ్డుకున్నారు.

వట్టిపోనున్న చెరువులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ హంద్రీ–నీవా ద్వారా కొత్త ప్రాజెక్టులకు కూడా నీరు అందించేలా చర్యలు తీసుకున్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు (కర్నూలు తాగునీటి పథకం)కు 3 టీఎంసీలు, డోన్‌లో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా 63 చెరువులకు నీరు ఇచ్చేందుకు 2 టీఎంసీలు, జిల్లాలోని శింగనమల చెరువుకు 1 టీఎంసీ, శింగనమల పాత తాలూకాలోని చెరువులకు 1.3 టీఎంసీలు, జీడిపల్లి, భైరవానితిప్ప, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 114 చెరువులకు 3.7 టీఎంసీలు, అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు, సోమరాంభ్లపల్లి రిజర్వాయర్, ముట్టాల, తోపుదుర్తి రిజర్వాయర్లకు 4.5 టీఎంసీలు, శ్రీసత్యసాయి జిల్లాలోని 193 చెరువులకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 3 టీఎంసీలు, కొత్త ప్రాజెక్టులకు 23 టీఎంసీలు కేటాయించడంతో పాటు 40 టీఎంసీల నీటిని రాయలసీమలోని 6 లక్షల ఎకరాలకు అందించేలా బృహత్ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారు. కాలువకు లైనింగ్ పనులు చేయడం ద్వారా భవిష్యత్తులో నీరంతా దిగువకు వెళ్లిపోయి చెరువులన్నీ పూర్తిగా వట్టిపోయే ప్రమాదం నెలకొంది.

అన్యాయం జరుగుతోంది



హంద్రీ–నీవా కాలువకు చేపట్టిన కాంక్రీట్ లైనింగ్ పనులతో ఒక్క రాప్తాడు నియోజకవర్గమే కాదు... మొత్తం రాయలసీమకే అన్యాయం జరుగుతోంది. రాయలసీమలోని 6 లక్షల ఎకరాలకు నీరు అందకుండా పోతాయి. భూములు బీళ్లుగా మారే అవకాశం ఉంది. ఈ అన్యాయాన్ని ప్రతిఘటించకపోతే రైతు మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. రైతులకు అన్యాయం జరగకుండా రిలే నిరాహార దీక్షలు రాప్తాడు నియోజకవర్గం నుంచే ప్రారంభిస్తాం. రాజకీయాలకు అతీతంగా రైతులంతా ఉద్యమించాలి. ఈ రిలే నిరాహార దీక్షలకు సంబంధించి ఇప్పటికే అధికారులకు, పోలీసులకు అనుమతులు కోరాం.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

పంటల సాగు కష్టం



రాప్తాడు నియోజకవర్గంలో చాలా పొలాలు హంద్రీ–నీవా కాలువ పక్కనే ఉన్నాయి. హంద్రీ–నీవా కాలువలో నీటి ప్రవాహం వల్ల భూగర్భ జలాలు పెరిగి మా వ్యవసాయ బోరు బావుల్లో నీటి లభ్యత పెరిగింది. దీంతో నాకున్న 4 ఎకరాల్లో చీనీ పంట సాగు చేశా. ఇప్పుడేమో కాలువకు లైనింగ్ పనులు చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే భూగర్భ జలాలు అడుగంటి బోరు బావుల్లో నీటి లభ్యత లేక పంటలు సాగు చేయడం కష్టమవుతుంది. రైతు కష్టాన్ని ప్రభుత్వం ఒకసారి ఆలోచించాలి. లైనింగ్ పనులు ఆపి 83 టీఎంసీల నీటి ప్రవాహం ఉండేలా కాలువను వెడల్పు చేయాలి.

– సుబ్బర రామాంజినేయులు, సిద్ధరాంపురం, ఆత్మకూరు మండలం

రైతుల పొట్ట కొట్టొద్దు



హంద్రీ–నీవాలో నీటి ప్రవాహం వల్ల చాలా మంది బోరు బావుల్లో నీటి మట్టం పెరిగింది. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా కాలువ పక్కన పొలాల్లో చీనీ, అరటి, టమాట, వరి, అంజూర, ద్రాక్ష, దానిమ్మ వంటి ఉద్యాన పంటల సాగు పెరిగింది. హంద్రీ–నీవా కాంక్రీట్ లైనింగ్ పనులు పూర్తయితే బోర్లు ఎండి పోయే ప్రమాదముంది. రైతులు నష్టపోతారు. కాంక్రీట్ లైనింగ్ పనులతో రైతుల పొట్ట కొట్టొద్దని ఈ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం.

– వెంకటేష్, సింగంపల్లి, ఆత్మకూరు మండలం

వర్ష సూచన

అనంతపురం అగ్రికల్చర్: రాగల ఐదు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. భారత వాతావరణశాఖ, విశాఖ కేంద్రం నుంచి అందిన సమాచారం మేరకు ఈ నెల 28న 10 మి.మీ, 29న 10 మి.మీ, 30న 12 మి.మీ, 31న 3 మి.మీ, మే 1న 4 మి.మీ సగటు వర్షపాతం నమోదయ్యే అవకాశముందన్నారు. ఉష్ణోగ్రతలు గరిష్టం 29.2 డిగ్రీల నుంచి 31.4 డిగ్రీలు, కనిష్టం 24.3 డిగ్రీల నుంచి 25.6 డిగ్రీల మధ్య నమోదు కావచ్చన్నారు. గాలిలో తేమశాతం ఉదయం 78 నుంచి 79, మధ్యాహ్నం 45 నుంచి 75 శాతం మధ్య రికార్డు కావచ్చన్నారు. నైరుతి దిశగా గాలులు గంటకు 16 నుంచి 20 కిలోమీటర్ల వేగంతో వీస్తాయన్నారు.

రేపటి నుంచి రైతుల వద్దకే శాస్త్రవేత్తలు

బుక్కరాయసముద్రం: 'వికసిత్ కృషి సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా ప్రయోగశాల నుంచి భూమికి అనే నినాదంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 29 నుంచి జూన్12వ తేదీ వరకు రైతుల వద్దకే శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి తెలిపారు. రోజూ 3 గ్రామాలు చొప్పున 32 మండలాల్లోని గ్రామాలను శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సందర్శించి రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఖరీఫ్ సీజన్‌లో అనువైన పంటలు, అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలు, ఎరువుల యాజమాన్య పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ, భూసార పరీక్షలు, డ్రోన్ వినియోగం, తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు.

పోక్సో కేసులో యువకుడికి రిమాండ్

రాప్తాడు: పోక్సో కేసులో ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. సీఐ శ్రీహర్ష తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం బత్తలపల్లి గ్రామానికి చెందిన యువకుడు మూడే అనిల్‌కుమార్ నాయక్.. రాప్తాడు పంచాయతీ పరిధిలోని మైనారిటీ కాలనీలో నివాసముంటూ చెరుకు రసం బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికను ప్రేమిస్తున్నానంటూ వెంటపడేవాడు. బాలిక ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సదరు యువకుడిని మందలించినా అతనిలో మార్పు రాలేదు. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో బాలిక తల్లి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ అనంతరం పోక్సో యాక్ట్ కింద అనిల్‌కుమార్‌నాయక్‌ను మంగళవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

బలవంతపు పెళ్లిపై ఫిర్యాదు

గుమ్మఘట్ట: తనకు ఇష్టం లేకపోయినా కుటుంబ సభ్యులు బలవంతంగా పెళ్లి చేశారంటూ పోలీసులకు ఓ బాలిక ఫిర్యాదు చేసింది. వివరాలు.. రాయదుర్గం పట్టణానికి చెందిన వ్యక్తికి ఇద్దరు కుమార్తెలు కాగా, పెద్దమ్మాయిని గుమ్మఘట్ట మండలం పూలకుంట గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారు. ఈ క్రమంలోనే మైనారిటీ తీరని రెండో అమ్మాయిని కూడా నెల రోజుల క్రితం పూలకుంట గ్రామానికి చెందిన మరో వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించారు. అయితే అప్పటికే అతనికి వివాహమై ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. రెండేళ్ల క్రితం భార్య అనారోగ్యంతో మృతి చెందింది. ఈ పెళ్లి ఇష్టం లేని బాలిక స్థానికుల సహకారంతో తప్పించుకుని నేరుగా ఎస్పీని ఆశ్రయించింది. తనకు ఇష్టం లేకపోయినా బలవంతంగా పెళ్లి చేశారని వాపోయింది. దీనిపై ఎస్పీ ఆదేశాల మేరకు గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మహానాడు కాదది.. దగానాడు

- మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

అనంతపురం కార్పొరేషన్: అలివిగాని హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు ఒక్కటీ నెరవేర్చలేదని, కడపలో టీడీపీ నిర్వహించేది మహానాడు కాదని.. దగా నాడుగా ప్రజలు భావిస్తున్నారని శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ అన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా రాష్ట్ర ప్రయోజనాలు నెరవేర్చలేదన్నారు. కనీసం ఇప్పటికైనా రాష్ట్రాభివృద్ధిపై తీర్మానాలు చేయించేలా చూడాలని ప్రజాప్రతినిధులకు హితవు పలికారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో దౌర్జన్య పాలన సాగుతోందన్నారు. కక్ష సాధింపులకు పోలీసు వ్యవస్థను వినియోగిస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రులు విడదల రజిని, సిదిరి అప్పలరాజుతో పాటు బడుగులు, దళితులపై పోలీసులు సాగించిన దౌర్జన్యంపై మహానాడులో చర్చించగలరా అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు సూపర్‌సిక్స్ పేరుతో ఇచ్చిన చంద్రబాబు హామీల్లో ఇప్పటి వరకూ ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. డబ్బులు లేవంటూనే ఏడాదిలో రూ.50 వేల కోట్లు మిగుల్చుకున్నారన్నారు. మొత్తమ్మీద ఒక్క ఏడాదిలోనే రూ.1,30,000 కోట్లు, అమరావతి పేరుతో రూ.30 వేల కోట్ల అప్పులు చేశారన్నారు. ఏఒక్కరికీ ఉద్యోగం కల్పించలేదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒకే ఏడాది లక్ష మందికి పైగా ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లాకు 2013లో ఎయిమ్స్ మంజూరైతే..దానిని మంగళగిరికి తరలించి జిల్లాకు అన్యాయం చేశారన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ కర్నూలులో హైకోర్టు, లా యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. కానీ ఎన్నికలకు ముందు చంద్రబాబు హైకోర్టు బెంచ్ తీసుకువస్తామని మాట ఇచ్చి తప్పారన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడాలని, కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు ప్రక్రియను కొనసాగించాలని, జిల్లాలో 20 లక్షల ఎకరాలకు విత్తన వేరుశనగ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టీడీపీ వారసులెవరు?

టీడీపీని ఎన్టీఆర్ స్థాపించి అధికారంలోకి తీసుకువస్తే.. ఆయన్ను వెన్నుపోటు పొడిచి తానే అధ్యక్షుడిగా చంద్రబాబు ప్రకటించుకున్న అంశంలో నేరపూరితమైన భావన కన్పించడం లేదా అని ప్రశ్నించారు. పార్టీకి అసలు వారసుడు బాలకృష్ణ దబిడిదిబిడే అంటూ తిరుగుతున్నాడని, మరొకరు (కుమార్తె) బీజేపీలో కొనసాగిస్తారో... తొలగిస్తారోనని ఆలోచిస్తున్నారని, ఇక జూనియర్ ఎన్టీఆర్ అవునా, కాదా అనే మీమాంశతోనే సరిపోతోందన్నారు. కార్పొరేట్‌కు సాగిలపడిన చంద్రబాబు.. తన స్వలాభానికి ప్రజల భూములను పావలా, అర్ధరూపాయికి కట్టబెడుతున్నారని విమర్శించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే కాకాణి అరెస్ట్

- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: రాజకీయ కక్షతో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్ట్ చేశారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఫల్యాలు, అసమర్థతను ప్రశ్నించే వారిపై రెడ్‌బుక్ రాజ్యాంగం ద్వారా కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని మండిపడ్డారు. మంగళవారం స్థానిక వైఎస్సాఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి కాకాణి అక్రమ అరెస్టును ఖండించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎలాంటి అభివృద్ధి లేకపోయినా అక్రమ కేసులు, అణిచివేత చర్యలు, కక్షపూరిత రాజకీయాలకు సీఎం చంద్రబాబు ఊతమిస్తున్నారన్నారు. మాజీ ఐఎఎస్, ఐపీఎస్‌లను సైతం వదిలిపెట్టకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌ను అప్రతిష్టపాలు చేసి, ఆయన్ను అరెస్టు చేసేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. తప్పుడు వాంగ్మూలాలు, సాక్ష్యాలు సృష్టించి కేసుల్లో ఇరికిస్తున్నా వైనంపై ఇప్పటికే ప్రభుత్వానికి కోర్టులు మందలిస్తున్నా పాలకుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదన్నారు. భార్యభర్తలు, అన్నదమ్ముల మధ్య తలెత్తే చిన్నపాటి ఘర్షణల్లో కూటమి నేతలు జోక్యం చేసుకోని రాజకీయంగా వాటిని వినియోగించుకోని గ్రామస్థాయిలో వైఎస్సాఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కూటమి నేతల అక్రమ అరెస్టులకు భయపడేది లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఇప్పటికే జిల్లాలో జరిగిన మినీ మహానాడులో కొందరు టీడీపీ సీనియర్ నేతలు గళం విప్పారని, ఈ వ్యతిరేక జ్వాలలు మరింత చెలరేగి కూటమి ప్రభుత్వాన్ని దహనం చేయక తప్పదని అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు నరసింహులు, ఈడిగ ప్రసాద్, బసవరాజు, ఏసీ ఎర్రిస్వామి, తిప్పయ్య, వీరన్న పాల్గొన్నారు.

రాత్రంతా సాగిన బదిలీల కౌన్సెలింగ్

- ఆన్‌లైన్ అంటూనే భౌతికంగా సాగిన కౌన్సెలింగ్



మంగళవారం తెల్లవారుజామున బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరైన మహిళా ఉద్యోగులు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం ఉదయం మొదలైన జోనల్ స్థాయి ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం తెల్లవారుజాము సరిగ్గా 6 గంటలకు ముగిసింది. అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జోనల్ స్థాయి కావడంతో ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ముగ్గురు సూపరెండెండెంట్లు, 31 మంది సీనియర్ అసిస్టెంట్లు, 19 మంది ఏడీఏలు, 118 మంది ఏఓలతో పాటు రిక్వెస్ట్ కింద ఐదుగురు సూపరెండెండెంట్లు. 32 మంది సీనియర్ అసిస్టెంట్లు, 26 మంది ఏడీఏలు, 122 మంది ఏఓలు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వీరితో పాటు వివిధ విభాగాల అసోసియేషన్లకు చెందిన నాయకులు తరలిరావడంతో జాతరను తలపించింది. ఇందులోనూ ఎక్కువగా మహిళా ఉద్యోగులు తరలివచ్చారు. 255 మందికి పైగా కౌన్సెలింగ్‌కు హాజరవుతున్నట్లు తెలిసినా కౌన్సెలింగ్ ప్రక్రియ జాప్యం చేయడం, సమయ పాలన పాటించకపోవడం, రాత్రంతా వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన మహిళా ఉద్యోగులు జాగరణతో పడిగాపులు కాసేలా చేయడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆన్‌లైన్ పక్రియ అంటూనే భౌతికంగా చేపట్టారు. ప్రతి విషయంలో ఒకరిద్దరు జేడీఏలు జోక్యం చేసుకోవడంతో ఆలస్యమైనట్లు చెబుతున్నారు. ప్రధానంగా ఏట స్థాయి అధికారులు రాత్రంతా నిద్రలేకుండా గడిపారు. అలాగే రిక్వెస్ట్ కింద, అసోసియేషన్ల వెసులుబాటు, కొందరు ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు పరిగణనలోకి తీసుకోకపోవడంతో సదరు ప్రజాప్రతినిధులు అధికారులపై సీరియస్ అయినట్లు తెలుస్తోంది.

ప్రమాదంలో యువకుడి మృతి



హనుమంత రాయుడు (ఫైల్)

బెళుగుప్ప: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం అంకంపల్లికి చెందిన ఆవుల హనుమంత రాయుడు (34)కు భార్య లక్ష్మీదేవి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. మంగళవారం ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి రహదారి పక్కనే ఉన్న గోడను ఢీకొని గుంతలోకి దూసుకెళ్లాడు. తలకు, చాతీకి బలమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్న హనుమంతరాయుడిని కుటుంబసభ్యులు వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు.

వేర్వేరు కేసుల్లో దుకాణదారులకు జరిమానా

అనంతపురం: ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు చేసిన వస్తు విక్రయదారులకు జరిమానా విధించడంతో పాటు సీఎం సహాయ నిధికి రూ.50 వేలు జమ చేయాలని జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు వెలువరించింది. వివరాలు.. అనంతపురంలోని పోస్టల్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న జి.రమేష్‌బాబు 2023, జూన్ 5న తన బైక్‌కు 'టర్న్ సిగ్నల్ ల్యాంప్'ను రామచంద్రనగర్‌లోని ఓ ప్రైవేట్ దుకాణంలో కొనుగోలు చేశాడు. ఆ సమయంలో ఎమ్మార్పీ రూ.143 ఉండగా, రూ.159లు దుకాణదారుడు వసూలు చేశాడు. ఈ అంశాన్ని సవాల్ చేస్తూ రమేష్‌బాబు జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై వాదనలు విన్న తర్వాత అదనంగా వసూలు చేసిన రూ.16తో పాటు మానసిక వేధింపులకు పరిహారంగా రూ.10 వేలు, న్యాయ ఖర్చుల కోసం రూ.3 వేలను బాధితుడికి చెల్లించడంతో పాటు అదనంగా సీఎం సహాయ నిధికి రూ.50 వేలు జమ చేయాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం.శ్రీలత, సభ్యుడు బి.గోపీనాథ్‌తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. అలాగే రామచంద్రనగర్‌లో ఒక దుకాణంలో కొనుగోలు చేసిన సంతూరు హ్యాండ్‌వాష్ ధర రూ.60లు కాగా, రూ.68లు వసూలు చేసిన వైనంపై జి.రమేష్‌బాబు దాఖలు చేసిన మరో కేసులోనూ ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ కేసులో కంప్యూటర్‌లో నమోదైన ధరల ఆధారంగా వసూలు చేశామని, అయితే కేసులో బలం కోసం పాత కవరు దాఖలు చేసి వినియోగదారుడు తప్పుదోవ పట్టిస్తున్నాడంటూ ప్రతివాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న తర్వాత అధిక మొత్తాన్ని వసూలు చేసినట్లు నిర్ధారణ కావడంతో వసూలు చేసిన అధిక మొత్తాన్ని తిరిగి చెల్లించడంతో పాటు మానసిక వేదన కలిగించినందుకు రూ.10 వేలు, న్యాయ ఖర్చులకు రూ.3 వేలు చెల్లించడంతో పాటు రూ.50 వేలు ముఖ్యమంత్రి సహాయనిధికి జమ చేయాలని కమిషన్ ఆదేశించింది. ఈ రెండు ఫిర్యాదుల్లోనూ వినియోగదారుడికి వెంటనే నష్టపరిహారం చెల్లించడంతో పాటు, సీఎం సహాయ నిధి మొత్తాన్ని దుకాణదారులు జమ చేశారు.

బాలిక బలవన్మరణం

తాడిపత్రి టౌన్: స్థానిక సీపీఐ కాలనీకి చెందిన రజని (16) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కాలనీకి చెందిన చాకలి పుల్లయ్య, రాజేశ్వరి దంపతుల కుమార్తె రజని ఇటీవల పదో తరగతి పరీక్షల్లో 500 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. ఫలితాలు వెలువడిన రోజున విజయవాడలోని కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ చదివిస్తామని తల్లిదండ్రులు చెప్పారు. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో తాడిపత్రిలోనే చదువుకోవాలని మూడు రోజుల క్రితం తల్లిదండ్రులు సూచించారు. దీంతో క్షణికావేశానికి లోనైన బాలిక మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు.

డీఈఈ సెట్ నిర్వహణకు రెండు కేంద్రాలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (డీఈఈ సెట్)–2025కు జిల్లాలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జూన్ 2న మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు జరిగే పరీక్షలకు చిన్మయనగర్‌లోని నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా, హంపాపురం వద్ద ఉన్న ఎస్‌వీఐటీ కళాశాలను కేంద్రాలుగా ఎంపిక చేశారు. అభ్యర్థులు https://apdeecet.apcfss.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన హాల్ టికెట్లతో పాటు ప్రభుత్వ గుర్తింపు కలిగిన ఆధార్, పాన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్‌లో ఏదో ఒకటి వెంట తీసుకెళ్లాలి.

30న జాబ్‌మేళా

గుంతకల్లు టౌన్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30న గుంతకల్లులోని శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల కరస్పాండెంట్ ప్రభాకర్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టాటా మొబైల్ మ్యానుఫ్యాక్చరింగ్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్‌తో పాటు 11 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై ఆయా కంపెనీల అవసరాల నిమిత్తం మానవ వనరులను ఎంపిక చేయనున్నారు. పూర్తి వివరాలకు 86396 25572, 99888 53335లో సంప్రదించవచ్చు.

క్లుప్తంగా

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం నేతలు

ఆత్మకూరు: స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వద్దని.. విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు సావిత్రమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విద్యుత్ చార్జీలు తగ్గించండి అంటూ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కన్నా రెట్టింపు స్థాయిలో విద్యుత్ చార్జీలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్, నేతలు జయమ్మ, రాజేశ్వరమ్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ

రాప్తాడు: జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలను పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ విజయకుమారి పేర్కొన్నారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో రేషన్ షాపుల డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఇక నుంచి కార్డుదారులు రేషన్ దుకాణాలకు వచ్చి రేషన్ తీసుకోవాలని సూచించారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ దుకాణాలు రోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు విధిగా రేషన్ పంపిణీ చేయాలన్నారు. అందులో 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, మంచాన పడిన వారికి ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. డీటీ చెన్నకేశవులు, సీఎస్‌డీటీ జ్యోతి, ఆర్‌ఐ కరుణాకర్ పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో తరలిస్తే చర్యలు తప్పవని సూచించారు. ద్విచక్రవాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలని కోరారు. మైనర్లు వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని, తల్లిదండ్రులు వారికి వాహనాలు ఇవ్వకూడదని తెలియజేశారు. అతి వేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, డెఫెక్టివ్ నెంబర్ ప్లేట్స్, అనధికార పార్కింగ్ మొదలైన ఉల్లంఘనలకు జరిమానా విధించారు.

సజావుగా హెల్త్ అసిస్టెంట్ల బదిలీలు

అనంతపురం మెడికల్: ఉమ్మడి జిల్లా ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం అనంతపురంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సజావుగా సాగింది. ప్రభుత్వ రీడిప్లాయ్‌మెంట్ ఆదేశాల మేరకు 215 మందిని సీనియారిటీ ప్రాతిపదికన వారు ఇచ్చిన ఆప్షన్ మేరకు ప్లేస్‌మెంట్ కల్పించినట్లు డీఎంహెచ్‌ఓ ఈ భ్రమరాంబదేవి తెలిపారు. ఏఓ గిరిజా మనోహర్‌రావు, మలేరియా అధికారి ఓబులు, కార్యాలయ పర్యవేక్షణ అధికారులు విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్లు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

11 గంటలైనా తెరచుకోని ఎంపీడీఓ కార్యాలయం



రాప్తాడు: ఎంపీడీఓ కార్యాలయాన్ని రోజూ ఉదయం 9 గంటలకే తెరుస్తారు. మంగళవారం వారం మాత్రం 11 గంటలవుతున్నా తెరవలేదు. బయట వేచి ఉన్న అటెండర్లు కేశమ్మ, వెంకటయ్యను విచారిస్తే అటెండర్ సాకే మహేశ్వరి వచ్చి తలుపులు తీసి 9.30 లోపు కార్యాలయంలోని అన్ని రూంలు క్లీన్ చేసి ఉంచుతుందని తెలిపారు. ఈ రోజు తాము 9.30 గంటలకు వచ్చి ఆమెకు పోన్ చేస్తున్నా ఫోన్ లిఫ్ట్ చేయడం లేదన్నారు. ఉదయం 11 గంటలకు సీనియర్ అసిస్టెంట్ అచ్యుతానంద బాబు రావడంతో ఆయన వద్దనున్న తాళాలతో కార్యాలయాన్ని తెరిచారు. ఇదిలా ఉండగా అధికారులు రోజూ ఉదయం 11 గంటలకు విధులకు హాజరవుతున్నారని ప్రజలు బాహాటంగానే చెబుతుండడం గమనార్హం.

రోడ్లపైనే నిలువుదోపిడీ

- మార్కెట్ సుంకం పేరుతో దందా
- చిరు వ్యాపారులను పీల్చిపిప్పి చేస్తున్న వైనం
- ఎమ్మెల్యే అనుచరులదే కాంట్రాక్ట్
- లబోదిబోమంటున్న బాధితులు

అనంతపురం కార్పొరేషన్: ఉదయం నుంచి సాయంత్రం వరకు రోడ్డుపక్కన చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ నాలుగు కాసులు వెనకేసుకునే నిరుపేదలు వారు. ఎండ, వాన, దుమ్ము, ధూళి ఇబ్బందులు పెడుతున్నా.. అవస్థలు పడుతూనే ఎలాగోలా పండ్లు, కూరగాయలు, ఇతరత్రా అమ్ముకుంటూ పొట్ట నింపుకునే చిరువ్యాపారాలు వారు. కూటమి ప్రభుత్వంలో అలాంటి వారినీ 'తమ్ముళ్లు' వదలడం లేదు. నిలువుదోపిడీ చేస్తున్నారు. సంత మార్కెట్ పేరుతో మెడపై కత్తి పెట్టి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

ఐదింతల వసూలు..

నిబంధనల ప్రకారం తోపుడు బండ్ల నుంచి రూ.10 మాత్రమే వసూలు చేయాలని నగరపాలక సంస్థ గెజిట్‌లో ఉంది. లారీ లోడ్‌కు రూ.50, ట్రాక్టర్, ఆటోలకు రూ.20, ఎద్దుల బండికి రూ.10, సైకిల్‌కు రూ.2 మాత్రమే వసూలు చేయాలి. కానీ అనంతపురం నగరంలో అటువంటి పరిస్థితే లేకుండా పోయింది. ఒక్కొక్కరి నుంచి రూ.20 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నారు. వాస్తవంగా వసూలు చేయాల్సిన దాని కంటే ఐదింతలు లాగుతున్నారు. నిత్యం 12 మంది యువకులు నగరంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనాల్లో తిరుగుతూ వసూళ్లకు పాల్పడుతున్నారు.



అనంతపురం మెడికల్ కళాశాల సమీపంలో తాటిముంజలు అమ్ముకునే మహిళ నుంచి రుసుం వసూలు చేస్తున్న దృశ్యం

రోజులోనే రూ. లక్షలు..

అనంతపురం నగరం రోజు రోజుకు విస్తరిస్తోంది. ఈ క్రమంలో నగరంలో నివసించే పేదలతో పాటు పామిడి, రాప్తాడు, శింగనమల, తదితర ప్రాంతాల నుంచి రైతులు, రైతు కూలీలు తోపుడుబండ్లు, ఆటోలు, చిన్న వాహనాలపై నగరానికి వచ్చి రోడ్ల పక్కన చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. అనంతపురం వ్యాప్తంగా మొత్తం 5 వేలకు పైగా తోపుడుబండ్లపై వ్యాపారాలు చేసుకుంటున్నారు. వీరితో పాటు వారంలో మూడు, నాలుగు రోజుల పాటు రూరల్ ప్రాంతాల నుంచి పండ్లు, కూరగాయలు, తదితర వ్యాపారాలు చేసుకుంటున్నారు. పొట్టకూటి కోసం ఇలా నగరాలకు వస్తున్న వారిని తమ్ముళ్లు పీల్చిపిప్పి చేస్తున్నారు. రోజూ భారీ మొత్తంలో వసూళ్లు చేస్తున్నారు. నిత్యం రూ.లక్ష పైగానే గుంజుతున్నారు. ఏటా రూ.3 కోట్లకుపైగా జేబుల్లోకి వేసుకుంటున్నారు.

ఎమ్మెల్యే అనుచరులే..

సంత మార్కెట్ అవసరం లేదని, ఆ విధానాన్ని రద్దు చేస్తే వ్యాపారులకు మేలు జరుగుతుందని సాక్షాత్తు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గత కౌన్సిల్‌లో ప్రస్తావించారు. అయితే, ఆయన అనుచరులే సిండికేట్‌గా మారి ఈ ఏడాది రూ.88.15 లక్షలకే సంత మార్కెట్ టెండర్ దక్కించుకున్నారు. చిరు వ్యాపారుల నుంచి నిత్యం రూ.లక్షల్లో వసూలు చేస్తూ దందా చేస్తున్నారు. పేద ప్రజలు ఇబ్బంది పడకూడదని గతంలో గొప్పలు చెప్పిన ఎమ్మెల్యే దగ్గుపాటి.. నేడు తన అనుచరులే పేదలను పీల్చి పిప్పిచేస్తున్నా నోరుమెదపకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

రోజూ రూ. వంద కడుతున్నా



రోజూ పామిడి నుంచి ఆటోకు రూ. 2 వేలు బాడుగ పెట్టుకుని తాటి ముంజల అమ్మకాలకు అనంతపురం వస్తున్నా. సంత మార్కెట్ అంటూ కొందరు యువకులు వచ్చి రూ. 100 వసూలు చేస్తున్నారు. ఇప్పటికి నెల రోజుల నుంచి కడుతున్నా. ఇక్కడ చూస్తే ముంజలు పూర్తిగా అమ్ముడుపోవు. వ్యాపారాలు అంతంతమాత్రమే. –సుధాకర్

ఇదెక్కడి న్యాయం..?

కురుకుంట నుంచి నిత్యం అనంతపురం వచ్చి పండ్లు అమ్ముకుంటున్నా. వ్యాపారం సరిగా జరగడం లేదు. గతంలో రూ.10 మాత్రమే వసూలు చేసే వారు. ఇప్పుడేమో రూ.50 కట్టాల్సిందే అంటున్నారు. ఇదెక్కడి న్యాయం. చిరు వ్యాపారాలు చేసుకుంటున్నా మరీ ఇంత పెద్ద మొత్తంలో వసూలు చేస్తే ఎలా? – అరుణ

వర్షాలపై అప్రమత్తంగా ఉండండి



ఎస్ఈ చంద్రశేఖర్‌తో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: రానున్న రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని ఎస్ఈ చంద్రశేఖర్‌ను మేయర్ వసీం ఆదేశించారు. మంగళవారం మేయర్ చాంబర్‌లో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. నగర ప్రజలకు శుద్ధ నీరు అందించేలా చూడాలన్నారు. ఎక్కడా పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. నగరంలో వీధి లైట్లు లేవంటూ ఫిర్యాదులు వస్తున్నాయని, తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జ్ ఈఈ నరసింహ, డీఈ దాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి కొత్త సుజికి యాక్సెస్



మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: నగరంలో అమృత్ సుజికీ షోరూంలో సుజికీ యాక్సెస్ 125 స్కూటర్ టీఎఫ్‌టీ వేరియంట్‌ను మంగళవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. కార్యక్రమంలో షోరూం డైరెక్టర్ రుకేష్‌రెడ్డి, మేనేజర్ క్రాంతికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కన్వర్షన్ తర్వాతనే పీఎస్‌హెచ్‌ఎంలుగా ఇవ్వాలి

అనంతపురం ఎడ్యుకేషన్: బదిలీల అనంతరం మిగులుగా ఉండే సబ్జెక్టు టీచర్ల అంగీకారం మేరకు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా (పీఎస్‌హెచ్‌ఎం) కన్వర్షన్ చేసిన తర్వాతనే వారిని పాఠశాలలకు కేటాయించి అనంతరం సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతులు కల్పించాలని పీఎస్‌హెచ్‌ఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కమిటీ మంగళవారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు గోసల నారాయణస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో త్వరలో జరగబోయే ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి పలు అంశాలను చర్చించారు. విద్యార్థుల సంఖ్య 150 కంటే ఎక్కువగా ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య 1+ 6 ఉండేలా అదనపు ఉపాధ్యాయ పోస్టు మంజూరు చేయాలన్నారు. తెలుగు మీడియం ప్రాథమిక పాఠశాలలకు కేటాయించిన సెకండరీ గ్రేడ్ ఉర్దూ టీచర్లను విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి ప్రకారం కాకుండా ఇంతకు మునుపు లాగే అదనంగా కేటాయించాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు రమణ. మద్రిస్వామి, ఓబుళపతి, గోవిందరెడ్డి, రంగప్రసాద్, సీనియర్ ప్రధానోపాధ్యాయులు , నాగభూషణ, గంగరాజు, జనార్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్లు, గోపాల్ రెడ్డి, మారెప్ప, నాగరాజు, ఈశ్వరయ్య, ఆంజనేయులు, ఆదినారాయణ స్వామి, చెన్నారెడ్డి, శివయ్య పాల్గొన్నారు.

ఘనంగా థామస్ మన్రో జయంతి వేడుకలు

అనంతపురం కల్చరల్: దత్తమండలాల తొలి ప్రిన్సిపల్ కలెక్టర్ సర్ థామస్ మన్రో 264వ జయంతిని మన్రో మెమోరియల్ ట్రస్టు చైర్మన్ తోట నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద మన్రో చిత్రపటం వద్ద పలువురు రచయితలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ మాట్లాడుతూ 1800–07 మధ్య అనంత కలెక్టర్‌గా ఉన్న మన్రో విరివిగా చెరువులు తవ్వించడం, చెట్లను నాటించడం ద్వారా కరువును పారదోలడానికి విశేష కృషి చేశారన్నారు. ట్రస్టు చైర్మన్ తోట నాగరాజు, సామాజిక సేవా కార్యకర్త అనిల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ మన్రో విదేశీయుడైనా భారతీయ సంస్కృతి పట్ల అమిత విశ్వాసం, గౌరవం కల్గి ఉండడం విశేషమని, అదే నేటి పాలకుల్లో లోపించడం విచారకరమన్నారు. సీనియర్ జర్నలిస్టు కొత్తపల్లి అనిల్‌కుమార్‌రెడ్డి, ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ వ్యవస్థాపకులు కేపీ రాజు, భీమసేనరావు, సాకే సుధాకర్, శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టవర్‌క్లాక్ వద్ద మన్రో చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

నవయుగ వైతాళికుడు 'కందుకూరి'

అనంతపురం కల్చరల్: సంఘసంస్కర్తగా, కవిగా, రచయితగా బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించిన కందుకూరి నవయుగ వైతాళికుడని వక్తలు అన్నారు. విశాలాంధ్ర బుక్ హౌస్ వేదికగా తెలుగు వెలుగు సామాజిక సాహిత్య సంస్థ వారు మంగళవారం కందుకూరి 106వ వర్ధంతి సందర్భంగా సాహితీ సమావేశం ఏర్పాటు చేశారు. సీనియర్ రచయితలు దాసన్నగారి కృష్ణమూర్తి, నాగరాజు, డాక్టర్ అంకె రామలింగమయ్య, కోగిర జయచంద్ర తదితరులు కందుకూరి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీజాతి ఆణిముత్యంగా, మహిళ చదువు కోసం ఉద్యమించి బాలికలకు ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేసిన ఘనత ఆయనదేనన్నారు. సామాజిక చైతన్యం కోసం 130 గ్రంథాలకు పైగా రచించిన ఆయన న్యాయవాద వృత్తిని వదలి సాంఘిక దురాచారాలపై ధ్వజమెత్తిన ధీశాలిగా కొనియాడారు. కార్యక్రమంలో కవులు షేక్ రియాజుద్దీన్, సుంకర రమేష్, శేషాద్రిశేఖర్ పరమేశ్వరరావు, విజయభాస్కరరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కందుకూరి వీరేశలింగం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రచయితలు, కవులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అనంతపురం కల్చరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వివిధ యోగా సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వివేకానంద యోగ కేంద్రం అధ్యక్షుడు మెళవాయి రాజశేఖరరెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, ఆయుష్ అధికారులు డాక్టర్ రామకుమార్, డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ నాయక్ తదితరులు యోగా విశిష్టతను తెలియజేశారు. బ్రహ్మకుమారీల జిల్లా ఇన్‌చార్జ్ సిస్టర్ శారద మాట్లాడుతూ బుధవారం పాతూరులోని బ్రహ్మకుమారీ కేంద్రంలో జరిగే యోగా అవగాహన సదస్సులో అందరూ పాల్గొనాలని కోరారు. అంతకు ముందు అధిక సంఖ్యలో తరలి వచ్చిన వివిధ కేంద్రాల సభ్యులతో కలిసి స్థానిక ఆర్ట్స్ కాలేజ్ నుంచి టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్ మీదుగా తిరిగి ఆర్ట్స్ కాలేజ్ వరకు ప్లకార్డుల్తో ర్యాలీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో యోగా గురువులు కృష్ణవేణి, ఆంజనేయులు, దివాకర్, మారుతీప్రసాద్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ మమత, సత్యసాయి ధ్యానమండలి చెన్నకేశవులు, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ శ్రీనాథ్, పుల్లయ్య, పతంజలి రవి తరుపున గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం మెడికల్: రోజూ ఓ గంట పాటు యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడి తొలగిపోతుందని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో యోగాంధ్ర ర్యాలీని కమిషనర్ ప్రారంభించారు. నగరపాలక సంస్థ నుంచి క్లాక్‌టవర్ తిరిగి నగరపాలక సంస్థ వరకు ర్యాలీ జరిగింది. వచ్చే నెల 21 వరకు జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని కమిషనర్ కోరారు. డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పావని, ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈ షాకీర్, ఇన్‌చార్జ్ ఏసీపీ శిరీష, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి

అనంతపురం: యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం బాస్కెట్‌బాల్ మైదానంలో యోగాసనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ యోగా కేవలం వ్యాయమం మాత్రమే కాదని, మానసిక, శారీరక వికాసానికి దోహదం చేస్తుందన్నారు. యోగా గురువులు కృష్ణవేణి, గురు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖలో జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీ స్కూల్ అసిస్టెంట్లకు అన్యాయం జరిగిందని రిజర్వేషన్ ఉద్యోగుల సంఘం, పరిరక్షణ కమిటీ ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం నగరంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎల్లన్న మాట్లాడుతూ జీఓ 2 ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా హెచ్‌ఎంల పదోన్నతులు నిర్వహించాలని చూస్తున్నారన్నారు. సీనియార్టీ జాబితాలోని స్కూల్ అసిస్టెంట్లను వెరిఫికేషన్ కోసం పిలిచిన విద్యాశాఖ ఎస్సీ, ఎస్టీ టీచర్ల గురించి ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. 2023లో హెచ్‌ఎంలు, ఎంఈఓ–2 లు గా కన్వర్షన్ అయ్యాయరన్నారు. ఆ వెంటనే రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారన్నారు. కానీ ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతులలో ఎస్సీ, ఎస్టీలకు అడక్వసీ పూర్తయిందని చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా ఎస్సీ, ఎస్టీ స్కూల్ అసిస్టెంట్లకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. రిజర్వేషన్ పరిరక్షణ కమిటీ జీవీ ఉజ్వల్, ఎస్సీ ఎస్టీ ఫోరం రామాంజనేయులు, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ నరేష్ పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న ఆర్ఈఎఫ్, పరిరక్షణ సమితి నాయకులు

జిల్లా జైలులో సదుపాయాలపై ఆరా



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్. రాజశేఖర్

అనంతపురం: జిల్లా జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి ఎన్. రాజశేఖర్ సందర్శించారు. జిల్లా జైలులో అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. ఖైదీలతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందించే న్యాయ సేవలను వివరించారు. ఆయన వెంట జిల్లా జైలు సిబ్బంది ఉన్నారు.

బకాయిలు చెల్లించాలి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పని చేస్తే పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జీజీహెచ్‌లో సూపరింటెండెంట్‌కు వారు వినతి పత్రం అందించారు. కార్మికులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్ అందించాలన్నారు. నాయకులు రాజేష్, రాజు, భార్గవి, ప్రశాంత్, లక్ష్మీదేవి, నాగరాజు పాల్గొన్నారు.

నెహ్రూ అడుగుజాడల్లో నడుద్దాం

అనంతపురం: సాంకేతిక రంగం పురోగతితోనే దేశాభివృద్ధి సాధ్యమని జవహర్‌లాల్ నెహ్రూ భావించి అందుకు అనుగుణంగా ప్రణాళిక అమలు చేశారని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలో మంగళవారం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి నిర్వహించారు.ఈసందర్భంగా వీసీ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నెహ్రూ విశిష్ట వ్యక్తిత్వం, సమయపాలన, ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య, ఓఎస్డీ టూ వీసీ ప్రొఫెసర్ ఓ .దేవన్న, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేఎన్‌టీయూఏ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు

ధర్మ పరిరక్షణకు ఏకమవుదాం

- బజరంగ్‌దళ్ జాతీయ కన్వీనర్ నీరజ్ దొనేరియా

అనంతపురం కల్చరల్: దేశ రక్షణ, ధర్మ పరిరక్షణ కోసం అందరమూ ఏకం కావాల్సిన తరుణం ఆసన్నమైందని బజరంగ్‌దళ్ జాతీయ కన్వీనర్ నీరజ్ దొనేరియా అన్నారు. విశ్వహిందూ పరిషత్తు, బజరంగదళ్ ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు సాగే 'ప్రాంత శౌర్య ప్రశిక్షణా వర్గ' రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమం మంగళవారం నగరంలోని కేశవరెడ్డి పాఠశాల ప్రాంగణంలో జరిగింది. నీరజ్ దొనేరియా ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. హిందూ సమాజాన్ని సంఘటితం చేస్తూ దేశభక్తి, సేవా భావన పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. దేశభక్తి, సేవ, సురక్ష, సంస్కారం అనే నాలుగు మూలాలపై యువతలో చైతన్యం పెంచేందుకు హిందూ సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రెండు రాష్ట్రాల కార్యదర్శి తణికెళ్ల రవికుమార్, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ పోలేపల్లి సందీప్, కోకన్వీనర్ రవి, జిల్లా అధ్యక్షుడు తాళంకి వెంకటరత్నమయ్య , విశ్వనాథరెడ్డి, కోనేటి రమణబాబు, గోరక్ష ప్రముఖ్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నీరజ్ దొనేరియా

ఇంటి స్థలాల కోసం పోరాడతాం

రాప్తాడురూరల్: పేదలందరికీ ఇంటిస్థలాలు కేటాయిస్తామంటూ కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీపై పేదలతో కలిసి పోరాడతామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున హెచ్చరించారు. సోములదొడ్డి సీపీఐ కాలనీలో మంగళవారం నిర్వహించిన శాఖా మహాసభలో ఆయన మాట్లాడారు. పేదలకు ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు పట్టించుకోవడం లేదన్నారు. సోముల దొడ్డి సీపీఐ కాలనీలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ అవసరం ఉందన్నారు. ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు. వి జాన్సన్ బాబు, రాప్తాడు నియోజవర్గ సహాయ కార్యదర్శి జి. శ్రీకాంత్, అనంతపురం రూరల్ మండల కార్యదర్శి ఎం. రమేష్, సహాయ కార్యదర్శి జి. నరేష్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. కాగా కాలనీ నూతన కార్యదర్శిగా నరసింహులు, సహాయ కార్యదర్శిగా వేణును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎండీయూ ఆపరేటర్ల పొట్టకొట్టొద్దు

అనంతపురం అర్బన్: ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడం ఆపరేటర్ల పొట్టగొట్టడమేనని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. ఎండీయూ వాహనాల రద్దు కారణంగా జిల్లా వ్యాప్తంగా 405 వాహనాలపై ఆధారపడిన దాదాపు 800 మంది ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని మంగళవారం వారు సంయుక్తంగా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

రా రమ్మంటోన్న రైల్ కోచ్ రెస్టారెంట్

'అనంత' నగరంలో మరో వండర్ ఆవిష్కృతమైంది. స్థానికులతో పాటు రైలు ప్రయాణికులకూ ప్రత్యేకమైన అనుభూతిని అందించే దిశగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు తీసుకున్న ప్రత్యేక చొరవతో స్టేషన్ ఆవరణలో ప్రగతీ'స్ రైల్ కోచ్ రెస్టారెంట్ అందుబాటులోకి వచ్చింది. రూ.కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ రెస్టారెంట్‌ను మరింత సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే పనులు సాగుతున్నాయి. రైలు బోగీ అంతర్భాగాన్నే రెస్టారెంట్‌గా మార్చేశారు. ఇందులో రైలు ప్రయాణికులతో పాటు సామాన్య ప్రజలకూ భోజన అవకాశం కల్పిస్తున్నారు. అనంతపురం రైల్వే స్టేషన్ ఆవరణలోకి అడుగుపెట్టగానే కుడి వైపున అత్యంత సుందరంగా నిర్మించిన రైల్ కోచ్ రెస్టారెంట్ అందరినీ రా రమ్మని ఆహ్వానిస్తోంది. – అనంతపురం సిటీ



రైల్ కోచ్ రెస్టారెంట్ ముందు భాగం (ఇనసెట్‌లో) రైలు బోగీలో ఇలా..